


**మల్‌రెడ్డి**
**విత్తనం ఉత్పత్తి చేసిన రైతు**
కుమ్మరివాండ్లపల్లి, గాండ్లపేట మండలం
అనంతపురం జిల్లా

"... ఈ కార్యక్రమం వల్ల గ్రామంలోనే విత్తనం అందుబాటులోకి వచ్చింది. అమ్ముకుంటే, మార్కెట్ కంటే కిలోకు 5-8 రూపాయలు ఎక్కువే మాకు వస్తోంది... శిక్షణలు, సలహాలు, సూచనలతో నాణ్యమైన విత్తనం పండించే జ్ఞానం మాకొచ్చింది..."



**వెంకటరమణ**
**విత్తనం కొనుగోలు చేసిన రైతు**
దొన్నకోట గ్రామం, నల్లమాడ మండలం
అనంతపురం జిల్లా

"... మా ఊరి రైతే పండిస్తాడు కాబట్టి విత్తనం మంచిదా కాదా అనేది ఊళ్లోనే తేలిపోతుంది... మార్కెట్ ధర, సబ్సిడీ రాయితీ లెక్కలోకి తీసుకుంటే, ఓ 4-5 రూపాయలు తక్కువకే మంచి విత్తనం చేతికి వచ్చింది... సబ్సిడీలో కొంత భాగం మా బ్యాంకు ఖాతాలో పడింది... ముఖ్యంగా మాకు విత్తనం కోసం పడిగాపులు పడే బాధ తప్పింది...."



**పి.వి. శ్రీరామమూర్తి**
**జాయింట్ డైరెక్టర్,**
వ్యవసాయ శాఖ,
అనంతపురం జిల్లా

"... అంతకుముందు విత్తన సంస్థల నుంచి తీసుకునే విత్తనం నాణ్యతపై చాలా ఫిర్యాదులుండేవి. సరిపడా విత్తనం రైతుకు అందించడం కష్టమయ్యేది. ఈ కార్యక్రమం అలాంటి సమస్యలను చాలామట్టుకు దూరం చేసింది...పైగా ప్రభుత్వానికి కూడా సబ్సిడీని మిగిల్చింది..."

# రైతుల నిర్వహణలో కొత్త విత్తన వ్యవస్థ

## అవసరమైన విధాన మార్పులు - కొన్ని కీలక అంశాలు

- ❖ స్థానిక పరిస్థితులు, పంటలకు అనుకూలంగా విత్తన వ్యవస్థ రైతు సంఘాల నిర్వహణలో ఉండాలనే మౌలిక సూత్రం.
- ❖ సీడ్ విలేజి కార్యక్రమాన్ని కొద్దిపాటి మార్పులతో విత్తన సబ్సిడీ కార్యక్రమంతో అనుసంధానపర్చడం.
- ❖ మండలం ప్రాతిపదికగా, అవసరాలకు అనుగుణంగా, విత్తన ఉత్పత్తి, సబ్సిడీ ద్వారా పంపిణీ జరిగేలా చూడటం.
- ❖ గ్రామ, పంచాయితీ స్థాయిలో చురుకుగా, సమర్థవంతంగా పనిచేస్తున్న రైతు సంఘాలను గుర్తించి, వాటి అధ్వర్యంలో విత్తన ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థల ఏర్పాటు, వాటి సామర్థ్యం పెంచడం.
- ❖ స్వపరాగ విత్తనాలకు సంబంధించి విత్తన ఉత్పత్తి, పంపిణీ అంశాలన్నీ గ్రామస్థాయి రైతు సంఘాల పరిధిలోనే ఉండేలా చూడటం.
- ❖ ఈ గ్రామస్థాయి రైతు సంఘాలు చేసుకోలేని అంశాలు మాత్రమే రాష్ట్ర విత్తన సంస్థ పరిధిలో ఉండేలా చూడటం.
- ❖ విత్తనం ఉత్పత్తి చేసే రైతులకు కార్పోరేషన్ ద్వారా ఫౌండేషన్ సీడ్ అందేలా చూడటం.
- ❖ గ్రామస్థాయిలో విత్తన శుద్ధి యంత్రాలు/ వ్యవస్థను ఏర్పాటు చేయడం
- ❖ రైతు సంఘాలు, వ్యవసాయ అధికారులు కలిసి విత్తన నాణ్యతను ధృవీకరించే వ్యవస్థను ఏర్పాటు చేయడం.
- ❖ విత్తన సబ్సిడీ రైతుల బ్యాంకు ఖాతాలలోకి నేరుగా జమ చేయడం
- ❖ గ్రామ స్థాయి రైతు సంఘాల అధ్వర్యంలో విత్తన ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థల ఏర్పాటు, పటిష్టతకు అవసరమైన స్థాయిలో బడ్జెట్ కేటాయింపులు జరపడం.
- ❖ రైతు సంఘాలను పటిష్టం చేయడానికి, కొత్త విత్తన వ్యవస్థ నిలబడడానికి స్వచ్ఛంద సంస్థల సాయం తీసుకోవడం.

> "కొత్త ప్రభుత్వం
> తన బడ్జెట్‌లో
> ఈ కొత్త విత్తన వ్యవస్థకు
> తగిన పునాది వేయాలి.
> ప్రభుత్వం పంపిణీ చేసే మొత్తం
> విత్తనంలో కనీసం 25%
> (సుమారు 2 లక్షల క్వింటాళ్ళు)
> ఈ కొత్త వ్యవస్థ ద్వారా
> రైతులకు అందించడానికి
> బడ్జెట్‌లో వీలు కల్పించాలి"









WASSAN | ecology centre | apps Anantha Paryavarana Parirakshana Samithi | Revitalising Rainfed Agriculture The RRA Network

వాసన్, 12-13-452, వీధి నెం. 1, తార్నాక, సికింద్రాబాద్-500017, తెలంగాణ, ఫోన్: 040-27015295/ 296. ఇ-మెయిల్: wassanmail@gmail.com, వెబ్: www.wassan.org

**ప్రభుత్వ విత్తన పంపిణీ వ్యవస్థ**






**ఏటేటా అదనుకు దొరకని విత్తనం...!**
**విత్తనం కోసం ఊరూరా బారెడు క్యూలు...!!**
**పోలీసుల సాయంతో విత్తన పంపిణీ చేయాల్సిన దుస్థితి...!!**
**విత్తనం రైతు చేతికి అందితే, అది 'నాసి రకపు' విత్తనం....!!**
**పంట వేస్తే చివరకి అసలుకే మోసం...!!**

## ఈ విత్తన వ్యవస్థను ఇలానే కొనసాగిద్దామా...?

ఇప్పుడున్న విత్తన పంపిణీ వ్యవస్థ హరిత విప్లవానికి అనుగుణంగా రూపొందించిన వ్యవస్థ. దాదాపు 40 ఏళ్ల కిందటి ఈ వ్యవస్థ ఇంకా అదే తీరులో కొనసాగడం సమంజసమేనా...?

ఈ వ్యవస్థలో భాగంగా, వ్యవసాయ శాఖ ఆయా పంటలకోసం ప్రతి ఏటా అవసరమైన విత్తనాన్ని అంచనా వేసి, వాటిని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఎ.పి.ఎస్.ఎస్.డి.సి.). హాకా, మార్క్‌ఫెడ్ వంటి అధీకృత సంస్థల ద్వారా సేకరించి, రైతులకు అందిస్తుంది. ఈ విత్తనం కూడా స్థానికంగా పండించింది కాదు... ఎక్కడో పండించింది..! ఈ నేపథ్యంలో విత్తనం అందించడానికి ప్రభుత్వం చేసే ప్రయత్నాలు, పెంచుతున్న విత్తన సబ్సిడీలు సమస్యకు పరిష్కారం చూపలేకపోతున్నాయి.



### పరిస్థితులు మారాయి....

**ప్రతి మండలంలోనూ సాగునీటి వసతి పెరిగింది.**
**పంటల సాగు పరంగా రైతులకు అవగాహన పెరిగింది.**
**సాంకేతిక సహకారం కూడా అందుబాటులోకి వస్తోంది.**
**స్వపరాగ సంపర్క పంటల విత్తనాన్ని స్థానికంగా ఏ మండలానికి అవసరమైనది ఆ మండలంలోనే పండించే అవకాశం ఉంది....**


మారుతున్న ఈ పరిస్థితులు, అందుబాటులో ఉన్న ఈ అవకాశాల ఆధారంగా ప్రతి మండలంలోనూ స్థానికంగా విత్తన ఉత్పత్తి, పంపిణీకి వీలు కల్పించే ఒక కొత్త విత్తన వ్యవస్థకు కొత్త ప్రభుత్వం తన బడ్జెట్‌లో అవసరమైన విధాన మార్పులు, బడ్జెట్ కేటాయింపులు జరపాలి... ఇది దేశంలోనే ఒక ఆదర్శప్రాయమైన మార్పుకు నాంది కావాలి...

**మరి ఆ దిశలో...**

**కొత్త విత్తన వ్యవస్థకు**
**ఈ బడ్జెట్ పునాది అవుతుందా..?**

## సబ్సిడీ విత్తనం - సమస్యల వలయం


స్థానిక పరిస్థితులకు అనువైన నాణ్యమైన విత్తనాలు, సరైన సమయానికి రైతుకు దొరకడం అన్నది వర్షాధార వ్యవసాయంలో ఒక కీలక అంశం. అయితే దురదృష్టవశాత్తు, దేశంలో ఇప్పుడున్న విత్తన వ్యవస్థ ప్రధానంగా హరిత విప్లవానికి అనుగుణంగా తీర్చిదిద్దబడింది. కొన్ని ప్రధాన పంటలకు సంబంధించి అధిక దిగుబడినిచ్చే వంగడాలు అభివృద్ధిపర్చడం, వాటిని ప్రోత్సహించడానికి ప్రభుత్వ కార్యక్రమాలు, సబ్సిడీల పరంగా వాటిని రైతులకు అందించడం ఆనవాయితీగా మారింది. అయితే ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంట దెబ్బతిన్నప్పుడు రైతు దగ్గర మరుసటి ఏడాది పంటకు విత్తనం కూడా లేకుండా పోతోంది. దీనివల్ల వర్షాధార ప్రాంతాలలో రైతులు ప్రభుత్వ విత్తన పంపిణీ వ్యవస్థపై ఆధారపడటం మరింత పెరిగింది. పంపిణీ కేంద్రాల వద్ద బారెడు క్యూలు, అవసరంలో సగం విత్తనం కూడా అందకపోవడం, నిరాశా నిస్పృహలతో రైతు నిలదీస్తే పోలీసుల వీరంగం... ఇవన్నీ ఏటేటా పత్రికల్లో సీజన్ వార్తలే.




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2012-13 సంవత్సరంలో అందించిన మొత్తం సబ్సిడీ విత్తనంలో దాదాపు 84% కేవలం నాలుగు పంటలకే (వేరుశెనగ, శెనగ, సోయాబీన్, వరి పంటలు) వెళ్లింది. ఇవన్నీ తేలికగా విత్తనం తయారుకావడానికి అవకాశం ఉన్న స్వపరాగ సంపర్క పంటలే..!

అనువైన భూమి, నీళ్లు, రైతులకు కొంత శిక్షణ ఉంటే ఏ మండలంలో అవసరమైతే ఆ మండలంలో ఈ పంటల విత్తనాలను తయరుచేసుకోవచ్చు. విత్తనాన్ని శుద్ధి చేసుకునే చిన్న తరహా యంత్రాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. వ్యవస్థాగత ఏర్పాట్ల పరంగా కూడా గ్రామస్థాయిలో పటిష్టవంతంగా పనిచేస్తున్న రైతు సంఘాలు, మహిళా సంఘాల వంటివి ఉన్నాయి. వీటి ఆసరాగా రైతులకు స్థానికంగానే విత్తనాలను అందించే వెసులుబాటు ఉంది.

ఇప్పటికీ, విత్తనం వేరే జిల్లాల నుంచి, వందల కిలోమీటర్ల దూరం నుంచి, రకరకాల సంస్థల చేతులు మారి, రైతుకు అందించాల్సిన అవసరం లేదు. ఒకప్పటి అవసరాలు, పరిస్థితులకు అనుగుణంగా ఏర్పడిన కార్పొరేషన్ల వ్యవస్థ అట్లాగే కొనసాగించవలసిన అవసరం కూడా లేదు. రైతుల నిర్వహణలో ఉండే విత్తన వ్యవస్థ కోసం అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం కొత్త ప్రభుత్వం ముందు ఉన్న ఒక మంచి అవకాశం.




గత మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందించిన విత్తన సబ్సిడీ వివరాలు

| సంవత్సరం | సబ్సిడీ (రూ. కోట్లలో) |
|---|---|
| 2011 -12 | 178.65 |
| 2012-13 | 183.00 |
| 2013-14 | 132,00 |

ఈ మొత్తం సబ్సిడీలో దాదాపు 70 శాతం సబ్సిడీ వర్షాభావ జిల్లాలైన అనంతపూర్, చిత్తూరు, కర్నూలు, కడప జిల్లాలే అందుకున్నాయి. వేరుశెనగ, ఇతర పప్పు ధాన్యాలు, పొద్దుతిరుగుడు పంటలు ఈ నాలుగు జిల్లాల్లోని ప్రధానపంటలు.

# 'మన విత్తనం' కార్యక్రమం


### గ్రామస్థాయిలో విత్తన ఉత్పత్తి - పంపిణీ


### అనంతపురం జిల్లాలోని కొన్ని మండలాలలో వ్యవసాయ శాఖ, స్వచ్ఛంద సంస్థలు - రైతు సంఘాల అనుభవం

**సీడ్ విలేజి కార్యక్రమాన్ని విత్తన సబ్సిడీ వ్యవస్థకు అనుసంధానపర్చి రాష్ట్ర వ్యవసాయశాఖ, కొన్ని స్వచ్ఛంద సంస్థలతో కలిసి అనంతపురం జిల్లాలో చేసిన ఒక ప్రయత్నం మండల ప్రాతిపదికగా రైతు నిర్వహణలో విత్తన వ్యవస్థ ఆదిరణ సాధ్యమని నిరూపించింది. 44 మండలాలలోని 654 గ్రామాలలో 9019 మంది విత్తన రైతులతో జరిగిన ఈ ప్రయత్నం ఒక నూతన విత్తన వ్యవస్థకు అవసరమైన విధివిధానాలను ప్రయోగాత్మకంగా అమలుచేసింది. వాసన్, అనంత పర్యావరణ పరిరక్షణ సంస్థ, యాక్షన్ ఫ్రాటర్నా, మరికొన్ని ఇతర సంస్థలు ఇందులో పాల్గొన్నాయి.**




2011-12లో 17 మండలాలకు చెందిన 183 గ్రామాలలోని 2083 మంది విత్తన రైతులతో మొదలై ఈ కార్యక్రమం, 2014-15 నాటికి 12455 క్వింటాళ్ల విత్తనం ఉత్పత్తి చేసి, 14274 మంది రైతులకు విత్తనాన్ని ప్రభుత్వ సబ్సిడీతో అందించింది. విత్తనాన్ని ఉత్పత్తి చేసిన రైతుల నుంచి విత్తనం అవసరమున్న రైతులు నేరుగా ధరను చెల్లించి కొనుక్కోగా, విత్తనం కొనుక్కున్న రైతుల బ్యాంకు ఖాతాలలోనికి ప్రభుత్వ సబ్సిడీ వెళ్లింది.




దేశంలోని తీవ్ర వర్షాభావ ప్రాంతాలలో ఒకటి అనంతపురం జిల్లా. జిల్లాలోని మొత్తం వర్షాధార సాగువిస్తీర్ణంలో 91% భూమిలో (దాదాపు 8 లక్షల హెక్టార్లలో) వేరుశెనగ వేస్తారు. ఈ పంటకు ఎకరానికి 70-90 కిలోల విత్తనం అవసరం. ప్రతి సంవత్సరం వ్యవసాయ శాఖ దాదాపు 2 నుంచి 3 లక్షల క్వింటాళ్ల వేరుశెనగ విత్తనం సబ్సిడీ మీద అందిస్తుంది. తరచుగా వచ్చే కరవు, పంటలు దెబ్బతినడం వల్ల సబ్సిడీ విత్తనం మీద రైతులు ఆధారపడడం బాగా పెరిగింది. ప్రతి ఏడాది రైతుకు విత్తనం అందించడం అనేది ప్రభుత్వానికి ఒక పెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ, వాసన్ సంస్థ సమాలోచనలు ఈ సమస్యకు ఆచరణకు సాధ్యమైన ఒక ప్రత్యామ్నాయాన్ని చూపాయి. అది 'మన విత్తనం' కార్యక్రమంగా రూపుదిద్దుకుంది.

'మన విత్తనం' కార్యక్రమంలో ప్రభుత్వానికి అయిన ఆదా వివరాలు (2014లో)

| | మన విత్తనం ద్వారా | ప్రభుత్వ విత్తన పంపిణీ వ్యవస్థ ద్వారా |
|---|---|---|
| విత్తన ఖర్చు (రూ / క్విం.) | 5200 | 6100 |
| రైతులు పెట్టుకున్నది | 4400 | 4400 |
| సబ్సిడీ | 800 | 1700 |
| తేడా (రూ.లలో / క్వింటాలుకి) | | 900 |
| పంపిణీ అయిన మొత్తం విత్తనం (క్వింటాళ్లు) | | 12,847 |
| మొత్తం విత్తనం విలువ (రూ.లలో) | | 6,68,02,320 |
| ప్రభుత్వానికి ఆదా (రూ.లలో) | | 1,15,61,940 |

**'మన విత్తనం' కార్యక్రమం ద్వారా 2014 సంవత్సరంలో పంపిణీ చేసిన 12847 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనం మీద సబ్సిడీ పరంగా ప్రభుత్వానికి దాదాపు 1.16 కోట్ల రూపాయల ఆదా అయ్యాయి. ప్రభుత్వం ప్రతి ఏటా రాష్ట్రంలో పంచే 7.66 లక్షల క్వింటాళ్ల విత్తనంలో కనీసం 25% విత్తనాన్ని (సుమారు 2 లక్షల క్వింటాళ్లు) 'మన విత్తనం' పద్ధతిలో రైతుల దగ్గరికి తీసుకువస్తే మండల స్థాయిలో విత్తన ఉత్పత్తి, పంపిణీ జరిగి, దానిమీద ప్రభుత్వానికి కనీసం 10 కోట్ల రూపాయల ఆదా అవుతాయని ఒక అంచనా. కేవలం డబ్బు పరంగానే కాకుండా, రైతులకు గంటల తరబడి క్యూలో నిలబడే బాధ తప్పుతుంది... ప్రభుత్వం, వ్యవసాయ శాఖ పరంగా వ్యవస్థాగతమైన ఖర్చులు కూడా తగ్గే అవకాశం ఉంది.**

## ఎవరెవరికి ఏమేం లాభం..?





**విత్తనం ఉత్పత్తి చేసిన రైతులకి...**

- విత్తన ఉత్పత్తి ని ఒక ఆదాయ అవకాశంగా చూడటం
- ముందే నిర్ణయించిన ధర, కొనుగోలు హామీ
- నాణ్యమైన బ్రీడర్ సీడ్ పొందడం
- శిక్షణలతో విషయ పరిజ్ఞానం పెంచుకోవడం
- విత్తన నాణ్యతపై దృష్టి పెరగడం
- మార్కెట్ ధర కన్నా ఎక్కువ ధర పొందడం
- అప్పటికప్పుడు ఆదాయం చేతికి అందడం

**విత్తనం కొన్న రైతులకి...**

- క్యూలలో వేచిఉండే బాధ లేకుండా నాణ్యమైన విత్తనాలు, సకాలంలో అందడం
- నాణ్యత ఆధారంగా, ఇష్టమున్న వారి నుంచి విత్తనాలు కొనే వెసులుబాటు
- ఆఫీసులు/బ్యాంకుల చుట్టూ తిరిగే బాధ లేకుండా, సబ్సిడీ మొత్తం నేరుగా బ్యాంకు ఖాతాలో జమకావడం
- చిన్న రైతులకు కూడా విత్తనం దొరికే అవకాశం

**ప్రభుత్వం / వ్యవసాయ శాఖకు...**

- విత్తన సేకరణ, ప్రాసెసింగ్ పరంగా ఖర్చులు తగ్గడం (క్వింటాలుకు 1100 రూపాయల వరకు)
- విత్తన సంస్థలు, దళారుల బెడద వదిలించుకోవడం
- సబ్సిడీ పంపిణీలో నగదు లావాదేవీలు లేకుండాపోవడం
- విత్తిన తరువాతనే సబ్సిడీ ఇవ్వడం మూలాన, మార్కెట్‌లో అమ్మడం వంటి అక్రమ లావాదేవీలు నియంత్రించబడటం